## క్లుప్తంగా

### రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుందలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి సోమవారం భక్తులు విరాళం అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. కర్ణాటకలోని మాన్వి పట్టణ వాస్తవ్యులు శరణప్ప వారి కుటుంబ సభ్యులు రూ.1.05 లక్షలను సోమవారం ఆలయ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, బాండు అందజేశారు. సీనియర్ అసిస్టెంట్ రామలింగారెడ్డి, ముఖ్య అర్చకుడు నాగరాజ్‌స్వామి పాల్గొన్నారు.

### ఉరుకుందకు తరలిన భక్తులు



స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి వారిని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో సందడి నెలకుంది. కార్తీక మాసంలో మొదటి సోమవారం కావడంతో భక్తులు అధికంగా తరలివచ్చి స్వామి దర్శించుకున్నారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం ఫల పుష్పాలతో ఆలంకరించారు. కొందరు క్షేత్ర ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం మహిళలు కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు.

### హిందూ ధర్మం సనాతనమైనది



ర్యాలీగా వెళ్తున్న కల్లుమఠం పీఠాధిపతి శ్రీ గురుసిద్ధదేవరు

ఆదోనిఅర్బన్: హిందూధర్మం సనాతనమైనదని, మన దేశం సాంస్కృతిక, సంప్రదాయాలకు నిలయమని కల్లుమఠం పీఠాధిపతి శ్రీ గురు సిద్ధదేవరు, ఎస్ఎస్ఎఫ్ రాయలసీమ జోనల్ ధర్మప్రచారక్ ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆదోని మండలస్థాయి హిందూ ధర్మ సమ్మేళన కార్యక్రమాన్ని పురస్కరించుకొని పట్టణంలో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం రెడ్డి జన సంఘం ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. హిందువుల వేద సంపద అమూల్యమైనదని, వేదాంతశాస్త్రం, తత్వశాస్త్రం, పురాణాలు ధర్మాన్ని ఆచరించడానికి కావాల్సిన లోతైన జ్ఞానాన్ని విశదీకరిస్తాయన్నారు.

### మూడు లారీలు సీజ్



రికార్డులను తనిఖీ చేస్తున్న సిసిరదీప్తి

మంత్రాలయం: మండలంలోని మాధవరం గ్రామంలో ఆదోని ఆర్టీఓ సిసిరదీప్తి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. పర్మిట్ లేని 3 లారీలను సీజ్ చేసి మాధవరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అలాగే రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం మూడు రోజుల క్రితం ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టిన కర్ణాటక ఆర్టీసీ బస్సును పరిశీలించారు.

### జాయింట్ అకౌంట్ విధానాన్ని విరమించుకోవాలి

ఆదోని సెంట్రల్: జేవీడీకి జాయింట్ అకౌంట్ విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ కోరారు. సోమవారం ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆర్‌పీవీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం వలస వెళ్లారని ఇలాంటి పరిస్థితిలో జాయింట్ అకౌంటును తప్పనిసరి చేయడం సరికాదన్నారు. జాయింట్ అకౌంటు ఓపెన్ చేయాలి అంటే రూ. 2 వేలు నుంచి రూ.5వేల వరకు డిపాజిట్ చేయాలని బ్యాంకు అధికారులు చెబుతున్నారని, దీంతో చాలామంది విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు గణేష్, సోమన్న, వీరేంద్ర, అబుల్లా, రఘు పాల్గొన్నారు.

# జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి కొనసాగింపు



డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్, నాయకులు,



కిట్లు పంపిణీ చేస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

ఆదోనిటౌన్: సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్ను సీఎంగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 27వ వార్డు పాతబస్టాండు సర్కిల్‌లో వార్డు సచివాలయం చేరువలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, జేసీఎస్ చైర్మన్ మధుసూదన్‌శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత పాల్గొన్నారు. ముందుగా పార్టీ జెండాను ఎగురవేసి, సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించారు. దేవా, మధుసూదన్‌శర్మ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల్లో అర్హులందరికీ పథకాలు వర్తింపజేసిన ఘనత జగనన్నదేనన్నారు. వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పోలకల్ రేణుక, మంజుల, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు చలపతి, నాయకులు, కార్యకర్తలు సింహం నాగేంద్ర, హర్షద్‌బాను, సుధాకర్, రామ్‌దాసు, అస్లాంబాషా పాల్గొన్నారు.

కోసిగి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జేసీఎస్ మండల కన్వీనర్ పి.మురళీమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పల్లెపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్ల, గృహసారథులతో కలిసి వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమం చేపట్టారు. ముందుగా గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ కార్యాలయంలో సంక్షేమ పథకాలు డిస్ ప్లే బోర్డును ప్రారంభించారు. ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, నాయకులు లంకా రెడ్డి, నరసయ్య, ఈరన్న, లక్ష్మన్న, కోతి నరసింహులు, లక్ష్మీరెడ్డి, కృష్ణరెడ్డి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

మంత్రాలయం: మండలంలోని మాధవరం గ్రామంలో సోమవారం వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జి.భీమారెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఏపీ వై నీడ్స్ జగన్ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి నిర్వహించారు. ముందుగా సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు వివిధ పథకాల కింద ప్రత్యక్షంగా,పరోక్షంగా రూ. 21,59,68,649 ప్రభుత్వం అందజేసిందని వివరించారు. సచివాలయం నుంచి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. నాయకులు రోగప్ప, ఉపసర్పంచ్ చిట్టెమ్మ, జంగం వీరన్నస్వామి, భీమిరెడ్డి, బసవరాజు, వీరారెడ్డి, హనుమంతురెడ్డి, జగన్నాథ్, పైబావివెంకటరెడ్డి, అల్లంభాష, మాభాష, కురువ విజయ్, నరసింహులు, దేవారెడ్డి, ముల్లా ఇస్మాయిల్‌వలి, అల్లంబాషా, పాల్‌రాజు, అరుణ్,ఆంధ్రయ్య, దావీదు, పెద్దలోకప్ప, చిన్నలోకప్ప, ఫరీద్, చిన్నకాజ, రామయ్య ఉన్నారు.

**నవరత్నాలతో ప్రతి ఇంటికీ పథకాలు**

కౌతాళం: నవరత్నాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని నదిచాగి ఎంపీటీసీ లింగన్నగౌడ్, మండల సచివాలయ కన్వీనర్ వెంకటరామిరెడ్డి, యువనాయకుడు సుబ్బారాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నదిచాగి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ కూడలి వద్ద పార్టీ జెండా ఆవిష్కరించి గ్రామంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అలాగే మండల కేంద్రమైన కౌతాళంలో యువ నాయకుడు సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వల్ల జరిగిన ప్రయోజనాలను వివరించారు. సూపరింటెండెంట్ సత్యన్న, కార్యదర్శి శివప్ప, ఉప సర్పంచ్ నగేష్, నదిచాగి ఇన్‌చార్జి రామన్నగౌడ్, నాయకులు బగ్గర్‌గౌడ్, వులిగప్ప, బండయ్యస్వామి పాల్గొన్నారు.



జెండావిష్కరణ గావిస్తున్న జేసీఎస్ మండల కన్వీనర్ మురళీ మోహన్ రెడ్డి



కౌతాళంలో పథకాల గురించి వివరిస్తున్న నాయకులు



నదిచాగిలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న దృశ్యం

### సమస్యలు పరిష్కరించాలి

ఆదోనిరూరల్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ అంగన్‌వాడీ యూనియన్ల నాయకులు పి.ఈరన్న, టి.వీరేష్, తిప్పన్న, గోపాల్, వరలక్ష్మి, జానకి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు తెలంగాణ రాష్ట్రం కన్నా ఎక్కువ వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. పెన్షన్ సౌకర్యం చివరి జీతంలో 50 శాతం ఇవ్వాలని, రాజకీయ జోక్యాన్ని అరికట్టాలన్నారు. సూపర్‌వైజర్‌లకు పదోన్నతిని 50 సంవత్సరాలు పెంచాలన్నారు. సర్వీసులో చనిపోయిన అంగన్‌వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

### వేతనాలు పెంచాలి

ఆదోనిరూరల్: మున్సిపల్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్‌లకు నెలకు రూ.26 వేలకు వేతనం పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఈరన్న, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, గోపాల్ కోరారు. సోమవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి గోవింద్‌సింగ్‌కి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 15 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న స్వీపర్‌లకు కనీస వేతనం ఇవ్వకుండా నెలకు కేవలం రూ.4 వేలు ఇస్తున్నారన్నారు. ఆ చిన్న జీతాలు కూడా మూడు లేదా నాలుగు నెలలకోసారి ఇవ్వడం సరి కాదన్నారు. స్కూల్ స్వీపర్ల సంఘం అధ్యక్షురాలు వై.పి.ఈరమ్మ, కార్యదర్శి విజయలక్ష్మి, కోశాధికారి ఎం.రాజేశ్వరి, స్వీపర్లు పాల్గొన్నారు.

### కోసిగి అభివృద్ధే ధ్యేయం



రోడ్డు పనులు చేయిస్తున్న నాయకులు

కోసిగి: కోసిగి మండల అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ముస్లిం మైనార్టీ కాలనీకి వెళ్లేందుకు ఉపాధి హామీ పథకం కింద రూ.17.40 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. పనులు పెండింగ్‌లో ఉన్న కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన నిధులతో చేయిస్తున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ హయాంలో కోసిగిలో దాదాపు రూ.3.50 కోట్ల తో రోడ్లు, కాల్వ పనులు చేయించినట్లు వివరించారు. ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, మంగమ్మ, కోసిగయ్య, మహంతేష్, బుళ్లి నరసింహులు, ఉస్మాన్, షౌకత్ ఆలి, గోవిందు, కాంట్రాక్టర్ బసిరెడ్డి పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసిన దృశ్యం

కౌతాళం: సాంకేతిక విద్యా పరిజ్ఞానం కోసం పుస్తకాల పఠనం ఎంతో అవసరం అని కౌతాళం గంథ్రాలయ అధికారిణి మధులీనా అన్నారు. గంథ్రాలయ వారోత్సవాల ముగింపులో భాగంగా బుక్స్ రీడింగ్, వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్, డాన్సింగ్, సింగింగ్, మ్యూజికల్ చైర్, స్కిప్పింగ్, ఆట పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం స్థానిక కన్నడ ప్రాథమిక పాఠశాలలో బహుమతులు అందజేశారు.

కోసిగి: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని పరిజ్ఞానం పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి దుల్లయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నాగేశ్వరి దేవి సమక్షంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. ముందుగా విద్యార్థినులకు క్రీడపోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

ఆదోనిఅర్బన్: గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు వేడుకలను సోమవారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు వేడుకల్లో ప్రశంసా పత్రాలు, మెమొంటోలను మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంతమ్మ ఆధ్వర్యంలో అందజేశారు. చిన్మయ విద్యాలయ పాఠశాల హెచ్‌ఎం కవిత, నెహ్రూ పాఠశాల హెచ్‌ఎం రామయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం దేవప్రసాద్ పాల్గొన్నారు.

పెద్దకడబూరు : మండలంలో గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ సుభాషిణి ఆధ్వర్యంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు లైబ్రేరియన్ ఆశాజ్యోతి బహుమతులు అందజేశారు.

# 20 టీఎంసీలకు పడిపోయిన నీటిమట్టం



టీబీ డ్యాం

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో నీటిమట్టం 20 టీఎంసీలకు పడిపోయింది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో 97 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం వల్ల డ్యాంకు ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. సోమవారం డ్యాంలో 1599 అడుగులతో 20 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో కేవలం 78 క్యూసెక్కులుండి అవుట్‌ఫ్లో 9,783 క్యూసెక్కులుంది. టీబీ డ్యాం నుంచి కర్నూలు జిల్లాలోకి ప్రవహించే తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి సంబంధించి ఆంధ్రాలో కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 594 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

# రీసర్వే గడువు పొడిగించాలి



గజ్జహళ్లి భూ సమస్యల గురించి వివరిస్తున్న రైతులు

హొళగుంద: గజ్జహళ్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే గడువును పొడిగించాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం గజ్జహళ్లి సచివాలయానికి వచ్చిన రైతులు తమ భూ సమస్యల గురించి అధికారులకు వివరించారు. వారు మాట్లాడుతూ.. భూములు, యజమానులు, విస్తీర్ణం తదితర విషయాలకు సంబంధించి ఆన్‌లైన్ అడంగల్‌లో తప్పుగా నమోదయ్యాయని, వాటిని సరి చేయాలని కోరితే.. ఈ నెల 24న ఆఖరు తేది అని, ఆలోపు సమస్యలను పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారని వాపోయారు. జిల్లా కలెక్టర్ స్పందించి గతంలో జరిగిన తప్పులను సరిచేసుకోవడానికి మరో 20 రోజుల గడువు ఇచ్చి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఏపీడీ అల్లిపీరా

నందవరం: గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓ శ్రీనివాసులు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏపీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లెల్లో చేపడుతున్న ఉపాధి పనులకు కూలీల హాజరు పెంచాలన్నారు. కరువు మండలంలో ప్రతి కుటుంబానికి 150 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. అలాగే 2024–25 ఆర్థిక సంవత్సరానికి పనులు గుర్తించాలని సూచించారు. రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించి పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈసీ నూర్జహాన్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు చేపట్టనుండటంతో పట్టణంలోని ఐదు సబ్‌స్టేషన్లలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ ఏడీ నాగేంద్రప్రసాద్ సోమవాకం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, కేవలం ఆలూరు రోడ్డు వైపు, మాధవరం రోడ్డువైపు మాత్రమే సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ప్రతి ఇంటికీ అయోధ్య అక్షితలు

ఆదోనిఅర్బన్: అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర అక్షితలను మండలాలు, గ్రామాలవారీగా డిసెంబర్ నెలలో ప్రతి దేవాలయానికి చేర్చి జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటికీ పంపిణీ చేస్తామని విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ సహ కార్యదర్శి నాగరాజు తెలిపారు. సోమవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో జరిగిన జిల్లా సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్, భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ తూముకుంట ప్రతాపరెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి, భీమ్‌రెడ్డి, రవిశంకర్ పాల్గొన్నారు.

### జయప్రదం చేయండి

కోసిగి: కర్నూలులో డిసెంబర్ 15, 16, 17వ తేదీల్లో జరిగే అఖిల భారత్ కిసాన్ కౌన్సిల్ సభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు రామాంజనేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కోసిగి కమిటీ ఆధ్వర్యంలో మంత్రాలయం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి సమస్యలు కౌన్సిల్ సమావేశంలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. పెద్దకడబూరు మండల కార్యదర్శి తిక్కన్న, జిల్లా నాయకులు మల్లయ్య, ఈరన్న పాల్గొన్నారు.

### పరీక్ష ఫీజు కట్టించుకోవాలి

ఆదోని సెంట్రల్: కళాశాల ఫీజులతో సంబంధం లేకుండా ఇంటర్మీడియెట్ పరీక్ష రుసుము కట్టించుకోవాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్ కుమార్ కోరారు. సోమవారం పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు బతుకుదెరవు కోసం వలస బాటపడుతున్న సమయంలో కళాశాల ఫీజులకు పరీక్ష రుసుముకు లింకు పెట్టడం సరికాదన్నారు. డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్, నాయకులు విష్ణు, వీరేష్, జయరాజ్, అశోక్ పాల్గొన్నారు.

### అన్నదానానికి విరాళం

పత్తికొండ రూరల్: పత్తికొండలోని అయ్యప్పస్వామి దేవాలయంలో అన్నదానానికి మద్దికెర మండలం మదనంతపురం గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తుడు నాగేష్ సోమవారం రూ.25 వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు దారామధుకు అందించారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎమ్మిగనూరు టౌన్: రాష్ట్రస్థాయి అండర్-14 ఫుట్‌బాల్ పోటీలకు మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కేసీ సౌమ్య అనే విద్యార్థిని ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కె.కృష్ణమూర్తి, పీడీ (ఫిజికల్ డైరెక్టర్లు) కె.సుజనకుమారి, టీ.నాగేశ్వరి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ.. విశాఖ జిల్లా భీమునిపట్నంలో ఈనెల 21వ తేదీ నుంచి జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సౌమ్య పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి సౌమ్యను హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు అభినందించారు.

### పాము కాటుతో రైతు మృతి

కృష్ణగిరి: చిట్యాల గ్రామ రైతు ఉలువ లక్ష్మన్న (65) సోమవారం పాము కాటుకు గురై మృతిచెందాడు. గ్రామ సమీపంలోని తన వరి మడికి నీరు పెట్టుకోవడంలో నిమగ్నమై ఉన్న లక్ష్మన్నను పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే కర్నూలులోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

# సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



ప్రజల సమస్యలను వింటున్న పరిపాలనాధికారి గోవింద్‌సింగ్

ఆదోనిరూరల్: ప్రజా సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి గోవింద్‌సింగ్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజలు అందజేసిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, సీనియర్ సహాయకులు రామయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సమస్యల్లో కొన్ని..**

- ఆదోని మండలం మాంత్రికి గ్రామానికి చెందిన హరిజన సుధాకర్‌కు సర్వే నంబర్ 100లో 7.65 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించింది, ప్రస్తుతం సదరు భూమి ఆన్‌లైన్‌లో మిగులు భూమిగా నమోదైందని, విచారణ చేసి తన పేరుపై నమోదు చేయాలని అర్జీ అందజేశారు.
- గోనెగండ్ల మండలం చిన్నమర్రివీడు గ్రామానికి చెందిన కురువ బసప్పకు సర్వే నంబర్ 384/2లో 16.69 ఎకరాల భూమిని సర్వే చేయాలని అర్జీ సమర్పించారు.
- కౌతాళం మండలం హాల్వి గ్రామానికి చెందిన మంజులబాయికి 250/1లో 4.10 ఎకరాల భూమికి రెడ్ మార్క్ ఉందని, విచారణ చేసి రెడ్ మార్క్‌ను తొలగించాలని వినతి పత్రమిచ్చారు.
- పొలం వెళ్లే దారిలో ఇరువైపులా ముళ్ల చెట్లు ఎక్కువగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని తొలగించాలని ఆదోని మండలం చిన్న పెండేకల్ గ్రామానికి చెందిన ఆంజనేయ కోరారు.

**నిర్ణీత సమయంలో సమస్యల పరిష్కారం**

ఆదోనిటౌన్: స్పందన కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యలకు నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలని మున్సిపల్ అధికారులకు కమిషనర్ రఘునాథరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు పలువరు పట్టణ వాసులు వినతి పత్రాలు అందజేశారు. ఇందులో.. మున్సిపాలిటీ పరిధిలోని చర్చీలు, క్రైస్తవ సంఘంల సమాధులతోటలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఫాదర్‌లు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్వన్‌పేట లోతట్టు ప్రాంతంలో రోడ్లు, కాలువలు వేయాలని, విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయని, వాటిని మరో చోటుకు మార్చాలని వేపమాను రమేష్, లక్ష్మన్న వినతి పత్రం సమర్పించారు. టిడ్కో ఇల్లు ఇవ్వాలని బావాజీపేటకు చెందిన నాగవేణి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన నరసమ్మ ఏపీఎల్‌ఐజీ పాలసీ క్లెయిమ్ అయ్యేలా చూడాలని దరఖాస్తు చేసుకున్నారు. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

### ఇళ్ల నిర్మాణాల పరిశీలన

దేవనకొండ: మండల కేంద్రంలో నిర్మితమవుతున్న గృహాలను హౌసింగ్ డీఈ ఆదినారాయణ సోమవారం పరిశీలించారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీఎం ఆవాస్‌దివాస్-ఆవాస్ సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా గృహాలను పరిశీలించడం జరిగిందని, లబ్ధిదారులకు త్వరితగతిన బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో మొత్తం 651 గృహాలు మంజూరయ్యాయని, ఇంకా చాలామంది లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేయలేదన్నారు. త్వరగా నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. ఈనెల 26వ తేదీ వరకు ప్రతి గ్రామంలో గృహాలను పరిశీలించనున్నామని తెలిపారు. ఈయన వెంట అడ్మినిస్ట్రేషన్ అధికారి ఇద్రూష్‌బాషా, హౌసింగ్ సిబ్బంది నాయుడు, నాగరాజు తదితరులు ఉన్నారు.

### యువకుడి అదృశ్యం



మధుశేఖర్ (ఫైల్)

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణంలోని 5వ వార్డులో నివాసముంటున్న దాదిపోగు మధుశేఖర్ (30) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన దాదిపోగు మద్దిలేటి కుమారుడు మధుశేఖర్‌కు కృష్ణగిరి మండలం తొగర్చేడు గ్రామానికి చెందిన గీతతో వివాహం అయ్యింది. వీరికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు సంతానం. మధుశేఖర్ సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో మూడేళ్ల క్రితం ఇతని భార్య పిల్లలతో సహాపుట్టింటికి వెళ్లింది. అప్పటినుంచి మానసిక వేదనకు గురై మతిస్థిమితం లేనివాడిలా ప్రవర్తిస్తున్నాడు. ఈ నెల 19న తన పిల్లలను చూసి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తొగర్చేడులో పిల్లలను చూసి వచ్చినట్లు కుటుంబసభ్యులకు తెలియజేశాడు. సాయంత్రం మళ్లీ వెళతానని చెప్పగా వద్దని ఇంట్లో వారు వారించినా వినకుండా వెళ్లిపోయాడు. విషయాన్ని భార్యకు తెలపగా ఇక్కడికి ఉదయం మాత్రమే వచ్చి వెళ్లాడని మళ్లీ రాలేదని తెలియజేసింది. దీంతో పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం తండ్రి మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

### భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



ముక్కెళ్లలో పూజలందుకున్న శివలింగం

కృష్ణగిరి: కార్తీక మాసంలో మొదటి సోమవారం కావడంతో మండలంలోని అన్ని గ్రామాల్లోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచే భక్తులు శివపార్వతులకు అభిషేకార్చనలు చేశారు. చుంచుఎర్రగుడి గ్రామంలోని రామలింగేశ్వర స్వామికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పెనుమాడ గ్రామంలోని శివాలయంలో భక్తులు పెద్ద ఎత్తున స్వామికి అభిషేకాలు నిర్వహించారు. శివాలయంలో 1,001 జ్యోతులను భక్తులు వెలిగించారు. పలు శివాలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాలలో కార్తీక మాసం సోమవారం కావడంతో పెద్ద ఎత్తున శివాలయాలలో మహిళలు దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. గ్రామానికి 3 కి.మీ దూరంలో ఉన్న బుగ్గ సంగమేశ్వర దేవాలయంలో కార్తీక మాసం పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయంలో వివిధ ఆకృతులలో ముగ్గులు వేసి దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారికి పూజలు నిర్వహించారు.

### చెక్‌డ్యాంలు, చెరువుల వివరాలు నమోదు చేయండి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మద్దికెర: మండలంలో అన్ని గ్రామాలలో వున్న చెరువులు, చెక్‌డ్యాంలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డివిజనల్ ఉప గణాంక అధికారి రవిప్రకాష్ ఆదేశించారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ మండలంలో దాదాపు 375 చెక్‌డ్యాంలు, చెరువులు ఉన్నట్లు గుర్తించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నీటి నిల్వలు పెంచేందుకు చర్యలు తీసుకుంటోందని, సంబంధిత అధికారులు నీటి వనరుల వివరాలు పొందుపరచాలన్నారు. తహసీల్దార్ నాగభూషణం, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, వీఆర్వోలు ఉన్నారు.